## నేరుగా సదరం సర్టిఫికెట్లను అందించాలి

– కాళ్ల జంగయ్య, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు



రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న దివ్యాంగుల పోరాట సమితి సభ్యులు

షాబాద్, ఫిబ్రవరి 12 : తీవ్ర అంగవైకల్యం గల వారికి స్లాట్ బుకింగ్ లేకుండా నేరుగా సదరం సర్టిఫికెట్లను అందించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాళ్ల జంగయ్య కోరారు. సోమవారం దివ్యాంగులతో కలిసి రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ల కోసం నెలలు, సంవత్సరాల సమయం పడుతుందన్నారు. నెల, నెలకు స్లాట్ బుకింగ్‌లు అని మీ సేవ ద్వారా బుకింగ్ చేసుకోవాలంటే అది 10 నిమిషాలు కూడా ఆన్‌లైన్ ఉండటం లేదన్నారు. ఒక వేల ఆన్‌లైన్ దొరికిన ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, ఫొటో, చివరికి వేలిముద్రలు అడగడంతో ఇండ్ల వద్ద మంచానికే పరిమితమైన దివ్యాంగుల పరిస్థితి చేతులు, కాళ్లు పనిచేయనప్పుడు వేలిముద్రలు ఏలా వస్తయో గ్రహించాలన్నారు. సదరం క్యాంపుల నిర్వహణను నిర్లక్ష్యం చేస్తున్న అధికారులను వెంటనే బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు బాల్‌రాజ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ రంగంలో పెను మార్పులు

– ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ శ్రీకాంత్



నేషనల్ వర్క్ షాప్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ శ్రీకాంత్, కాలేజీ చైర్మన్ కొమరయ్య తదితరులు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 12: ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌కు మంచి భవిష్యత్తు ఉన్నదని ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్వీ శ్రీకాంత్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు సమీపంలోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో రీసెంట్ ట్రెండ్స్ ఆన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ అంశంపై వన్ వీక్ నేషనల్ వర్క్ షాప్‌ను సోమవారం కాలేజీ చైర్మన్ మల్క కొమరయ్య, ప్రిన్సిపాల్ ఎంబీ రాజుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన అంశాల గురించి వర్క్ షాపుల ద్వారా తెలుసుకుని విద్యార్థులు ఉజ్వల భవితకు పునాదులు వేసుకోవాలని చెప్పారు. ఈ రంగంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయని, అధునాతన సాంకేతికత అందుబాటులోకి వస్తున్నదన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ఎన్వీఎస్ స్వామి, అడ్వైజర్ డీవీ రమణ, డిపార్ట్‌మెంట్ హెడ్ విశ్వప్రకాశ్ బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్క నవీన్‌కుమార్, ఏవో అంబాల శ్రీధర్, కాలేజీ ప్రతినిధులు, ప్రొఫెసర్లు రాజేందర్‌రెడ్డి, సైదులు, మహేశ్, ఎం వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

## విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

అలై ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, పాప్ సింగర్ స్మిత



మాట్లాడుతున్న అలై ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, పాప్ సింగర్ స్మిత

కొడంగల్, ఫిబ్రవరి 12 : విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని అలై ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, పాప్ సింగర్ స్మిత సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట, ముచ్చట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చేయూతనందించాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో హరివిల్లు ఫౌండేషన్ సహకారంతో అలై ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మూడు నెలల కింద ఐదు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 450 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందించామన్నారు. 7,8,9,10 విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆప్‌ను కొనుగోలు చేసి ట్యాబ్‌లో పొందుపరచి నెట్ సౌకర్యాలను కూడా అందించినట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని ఆయా పాఠశాలలకు సంబంధించి మొత్తంగా 100 ట్యాబ్‌లను అందించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యే కాబట్టి వారి ద్వారా నియోజకవర్గంలోని పాఠశాలల అభ్యున్నతితో పాటు ప్లే గ్రౌండ్ వంటివి ఏర్పాటు చేసుకొంటే క్రీడల్లో జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించే ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థినులు సాంస్కృతి ప్రదర్శనలు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రవీంద్రయాదవ్, ఎంఈవో రాంరెడ్డి, హరివిల్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మురారి, సలహాదారులు చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి అనిల్, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, అనిల్‌కుమార్, గోపాల్, వీరేశం, విజయలక్ష్మి, లక్ష్మి, రాధిక, బాకారం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కొడంగల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు




అన్నదాతల నేస్తం..

రైతన్నలకు స్వల్ప, మధ్యకాలిక రుణాలు మంజూరు

- పొదుపు అలవాట్లు, ఆర్థిక పరిపుష్టిలో కీలకం
- పురుగుల మందులు, ఎరువులు, విత్తనాలు, పనిముట్ల పంపిణీ
- గ్రామీణ రుణ గ్రహీతలకు మెరుగైన సేవలు

# సేవలు అమోఘం

## ఆదర్శంగా నిలుస్తున్న ముడిమ్యాల్ పీఏసీఎస్

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 12 : వ్యవసాయ రుణ గ్రహీతలకు వారి ఆర్థిక ఆసక్తి, పొదుపు అలవాట్లని ప్రోత్సహిస్తూ.. స్వల్ప, మధ్యకాలిక రుణాలు సకాలంలో మంజూరు .. సహకార రంగాన్ని బలోపేతం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నది చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం). చేవెళ్ల మండలంలో చేవెళ్ల, ఆలూర్, గుండాల, ముడిమ్యాల్ గ్రామాల్లో 4 పీఏసీఎస్‌లు ఉన్నాయి. ఇందులో ప్రాంతీయ అసమానతల తొలగింపునకు... స్థానిక ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా సొసైటీ ముడిమ్యాల్ సొసైటీ బ్యాంకు ముందుకు సాగి విశేషమైన సేవలు అందిస్తున్నది.

**రెండు శాఖల ఏర్పాటు..**

ముడిమ్యాల్ పీఏసీఎస్‌కు ముడిమ్యాల్, రావులపల్లి, కుమ్మెర, మల్కాపూర్, గొల్లపల్లి, ధర్మసాగర్, కందవాడ, నారాయణ్‌దాస్‌గూడ, మల్లారెడ్డిగూడ, ఎర్రోనికొటాల గ్రామాల పరిధిలోని రుణ గ్రహీతలకు స్వల్ప, మధ్యకాలిక రుణాలను అందిస్తున్నది. ప్రజలకు దూర భారం లేకుండా అనువుగా ఉండేందుకు ఈ బ్యాంకు పరిధిలో మల్కాపూర్, కందవాడ గ్రామాల్లో రెండు శాఖలను అదనంగా ఏర్పాటు చేశారు.

**అందించిన రుణాలు..**

పంట రుణాలు, దీర్ఘకాలిక, బంగారు, ఎన్ఎఫ్ఎస్ (నాన్ ఎంప్లాయీస్ స్కీమ్స్), సేవింగ్ డిపాజిట్స్, ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్ తదితర రుణాలను అందిస్తున్నది. పీఏసీఎస్ పరిధిలో 950 మంది రైతులకు పంట రుణాలు, 139 మందికి లాంగ్ టర్మ్ లోన్స్, 296 మందికి బంగారు రుణాలు, నిరుద్యోగిత కింద 50 మందికి, 1841 మంది సేవింగ్స్ డిపాజిట్, పిక్స్‌డ్ డిపాజిట్ రూ. 25 లక్షల వరకు చేశారని సొసైటీ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

**సౌకర్యాలు..**

- క్యాష్ కౌంటర్లు, లాకర్ సిస్టం, ఉద్యోగుల సేవలు సక్రమంగా నిర్వర్తిస్తున్నారు.
- తిరిగి చెల్లింపుల విషయంగా కీలకంగా వ్యవహరిస్తున్నది.

**పురుగుల మందులు, ఎరువులు, విత్తనాలు..**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహకారసంఘం ఆధ్వర్యంలో పురుగుల మందులు, ఎరువులు, విత్తనాలు నేరుగా డీలర్లతో సంప్రదించి వారికి అందజేస్తున్నారు. గోల్డ్ లోన్స్ కింద తులానికి రూ. 40 నుంచి 45 వేలు కేవలం 80 పైసల వడ్డీకి మాత్రమే అందజేస్తున్నారు. నాన్ ఎంప్లాయీస్ స్కీమ్ కింద కిరాణం షాపులు, పంక్చర్ షాపులు, బట్టల షాపులు, కటింగ్ షాపులు, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు స్థానిక యువతకు రుణాలు ఇస్తున్నారు. మార్టిగేజ్ లోన్స్ కింద భూమికి సంబంధించిన పాసు పుస్తకాలు తనాఖా పెట్టి రుణాలు ఇవ్వడం, గొర్రెలు, బర్రెలు, పౌల్టీఫాం, హార్వెస్టర్, పండ్ల తోటలు తదితర వాటిని ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందజేస్తున్నారు.

**ఆర్వో ప్లాంట్‌ల ఏర్పాటు..**

ముడిమ్యాల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మల్కాపూర్, రావులపల్లి, మల్లారెడ్డిగూడ అనుబంధ గ్రామం ఎర్రోని కొటాలలో ప్రజలకు మంచి నీటి సౌకర్యార్థం ఉచితంగా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు.

**గోల్డ్ లోన్స్, నాన్ ఫాం సెక్టార్..**

బంగారు రుణాలు, (ఎన్ఎఫ్ఎస్) నాన్ ఫాం సెక్టార్ స్కీమ్స్ కింద కేవలం మడిమ్యాల్ పీఏసీఎస్‌లోనే ఈ సేవలు అందుబాటులో ఉండడం విశేషం. చేవెళ్ల మండల ఫరిధిలోని మిగతా మూడు పీఏసీఎస్‌లలో ఇలాంటి సౌకర్యం లేదు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేకంగా ఈ స్కీమ్స్ ప్రవేశపెట్టినట్లు తెలుస్తున్నది.

### స్థానికుల ఆర్థిక బలోపేతమే లక్ష్యం..



స్థానికంగా ఉన్న రైతులు, నిరుద్యోగులు, వ్యాపారం చేసుకునే వారు ఆర్థికంగా ఎదగడానికి, వారి అభివృద్ధికి ప్రాథమిక సహకార సంఘం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తున్నది. గ్రామీణ ప్రాంతాల ప్రజల అసమానతలను రూపుమాపడానికి అనేక స్కీమ్స్ ద్వారా వారి ఆర్థిక పరిపుష్టికి శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాం. మిగతా సొసైటీలతో పోలిస్తే మా పీఏసీఎస్‌లో అన్ని విధాలుగా రుణాల మంజూరు, తిరిగి చెల్లింపులలో కూడా కీలకంగా వ్యవహరిస్తున్నాం. లక్ష్యానికి మించి రుణాలు మంజూరు చేశాం. రికవరీలోనూ ముందున్నాం.

– గోనె ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, ముడిమ్యాల్

## విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించండి

వైద్యాధికారులను ఆదేశించిన వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల అకస్మిక తనిఖీ



వంటగదిలోని స్టాక్ వివరాల రికార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 12 : పచ్చకామెర్లతో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పచ్చకామెర్ల మూలంగా అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు పౌష్టికాహారంతో పాటు పండ్లను అందించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు పారిశుధ్యం పాటించాలని సూచించారు. వంట గదిలో పని చేసే సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల మరమ్మతులు, లీకేజీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌కు సూచించారు. కలెక్టర్ ఆకస్మిక పర్యటనలో భాగంగా నీటి సంపు, భోజన శాల, వంట గది, స్టోర్ ను పరిశీలించారు. ఆహార పదార్థాల నిల్వ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ తో పాటు డీఎస్సీడబ్ల్యూ మల్లేశం, డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

## ఈ నెల 14న కానిస్టేబుల్ ఉద్యోగ నియామక పత్రాల అందజేత

–ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 14న నియామక పత్రాలను ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. ఇందులో భాగొంగా సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించి 883 మందికి, రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించి 506 మందికి సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేయనున్నారని తెలిపారు. 14వ తేదీన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అభ్యర్థులు గచ్చిబౌలిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వారు అంబర్‌పేట పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు ఉదయం 8 గంటలకు హాజరు కావాల్సి ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులకు సమాచారం ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి అభ్యర్థులను జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఆర్టీసీ బస్సుల్లో ఎల్బీ స్టేడియానికి తీసుకెళ్లాలన్నారు. ప్రతి బస్సులో ఒక లైజన్ అధికారి, ఒక కానిస్టేబుల్ ఉంటారని తెలిపారు. సైబరాబాద్ కు 19 బస్సులు, రాచకొండకు 11 బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు, జిల్లా విద్యా శాఖ అధికారి సుశీందర్‌రావు, సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, గిరిజన సంక్షేమ అధికారి రామేశ్వరీదేవి, మైనార్టీ సంక్షేమ అధికారి నవీన్‌రెడ్డి, స్థానిక రవాణా శాఖ అధికారి రఘునందన్‌గౌడ్ పాల్గొన్నారు.

# వరికి మొగి పురుగు



లార్వా దశలో మొగి పురుగు



రెక్కలు వచ్చిన తర్వాత..

# రైతన్నకు దిగులు

- ఉధృతంగా వ్యాపిస్తున్న తెగులు
- గత సీజన్‌లోనూ విజృంభన.. దిగుబడిపై ప్రభావం
- అన్నదాతల్లో ఆందోళన
- క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న అధికారులు
- నివారణ చర్యలపై సలహాలు సూచనలు



మొగి పురుగు ఆశించిన వరిపైరు

కరీంనగర్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే చాలా చోట్ల వరి నాట్లు పూర్తి చేశారు. కొందరు రైతులు జనవరిలో నాట్లేశారు. యాసంగి ప్రారంభంలోనే మొగి పురుగు ఉధృతిని గుర్తించిన వ్యవసాయ అధికారులు, కేవీకే, ఏరువాక, పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. మొగి పురుగు నివారణకు సూచనలు చేస్తూ.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సారి మొగిపురుగు ప్రభావంతోపాటు జింక్ లోపం, సల్ఫైడ్ ప్రభావం కూడా కనిపిస్తున్నట్టు పొలాస శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

### ఇవీ లక్షణాలు

ఆలస్యంగా లేదా నారు ముదిరిన తర్వాత నాట్లు వేయడం, సాధారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు కావడం, సూర్యరశ్మి రోజుకు 7 గంటల కంటే తక్కువగా ఉండడం, నత్రజని తక్కువగా వాడడం, కాండం బలహీనం కావడం వంటి కారణాలతో మొగి పురుగు వ్యాప్తిస్తున్నది. నారుమడిలో ఆశిస్తే మొక్కల పిలకలు ఎండి చనిపోతాయి. ప్రారంభం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి. నాట్లు వేసిన పది పన్నెండు రోజుల్లో ఆశిస్తే.. పొలాలు మాడి పోతాయి. పురుగు లార్వా దశలో ఉన్నపుడే కాండం తొలుస్తూ పంటకు ఎక్కువ నష్టం చేస్తుంది. రెక్కలు వచ్చిన తర్వాత తన సంతానాన్ని ఉధృతం చేసేందుకు చుట్టు పక్కల వరి పంటను ఆశిస్తుంది. దీనికి తోడు జింక్ లోపం, సల్ఫైడ్ దుష్ప్రభావంతోనూ వరికి నష్టం వాటిల్లుతున్నది. రైతులు పంట మార్పిడి పాటించక పోవడం, ప్రతి సీజన్‌లో వరినే సాగు చేయడం వల్ల ఈ లోపాలు ఏర్పడుతున్నట్లు వ్యవసాయ శాస్త్ర వేత్తలు చెబుతున్నారు.

### నివారణ చర్యలు

ప్రస్తుతం చాలాచోట్ల వరి పొలాలు పిలక దశలో ఉన్నాయి. ఈ సమయంలో మొగి పురుగు ఉధృతిని నివారించేందుకు ప్రతి ఎకరాకూ 3 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. అందులో వారానికి బుట్టకు 25-30 పురుగులు పడినప్పుడు తప్పని సరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఈ దశలో ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదంటే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు, లేదంటే క్లోరాన్ట్రోనిలిప్రోలు 4జీ గుళికలు 4 కిలోలు 20 నుంచి 25 కిలోల ఇసుకలో కలిపి బురద పదనులో వేసుకోవాలి. మొగి పురుగు నివారణకు సిఫారసు చేయబడని ఏ ఇతర 10జీ లేదా సేంద్రియ గుళికలు (గంట గోళీలు) యూరియాతో కలిపి వేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని రైతులు గమనించాలి. ఒక వేళ వరి పంట చిరుపొట్ట దశలో రెక్కల పురుగు ఉధృతిని గమనిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్, 50 శాతం ఎస్పీ 2 గ్రాములు, (ఎకరాకు 400 మిల్లీ లీటర్లు ) లేదంటే క్లోరాన్ట్రోనిలిప్రోలు 0.3 మిల్లీ గ్రాములు (ఎకరాకు 60 మిల్లీ లీటర్లు) లేదంటే ఐసోసైక్లోసిరం 0.6 మిల్లీ లీటర్లు (ఎకరాకు 120 మిల్లీ లీటర్లు) ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



కుళ్లిన వరి వేరు..

### సల్ఫైడ్ దుష్ప్రభావం



సల్ఫైడ్ దుష్ప్రభావంకు గురైన వరి పంట

సల్ఫైడ్ దుష్ప్రభావంతో వరి నేలల్లో, పంట మధ్య కాలంలో అక్కడక్కడ బాగా పెరిగిన పంట మొత్తం పసుపు వర్ణంలోకి మారిపోవడం, మడి బాగా మెత్తగా ఉండి కాలు చాలా లోతుగా దిగబడి పోతుంది. పొలంలో నడుస్తుంటే బుడగల రూపంలో గాలి బయటకు వస్తుంది. నేల నుంచి దుర్గంధం వాసన, మొక్కను వేర్లతో బయటకు తీసినప్పుడు కుళ్లిన కోడిగుడ్ల వాసన వస్తుంది. పంట వేర్లు పూర్తిగా నల్లబడి జీవం లేక కుళ్లిన వాసన వస్తుంది. మొక్కలు పూర్తిగా చనిపోయే ప్రమాదముంటుంది. అధిక నీటి ముంపు ఉండడం, తగిన రీతిలో పంట వేర్లకు గాలి అందక పోవడం, నేలలో రసాయన చర్యల వల్ల లభ్య ఇనుము మార్పు చెందక పోవడం, చాలా కాలంగా బరువు నేలల్లో సల్ఫర్ (గంధకం) కలిగిన 20-20-0-15, 20-20-0-13 లాంటి కాంప్లెక్స్ ఎరువులు అధికంగా వాడడం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో మొక్క వేర్లకు తగిన గాలి తగిలేలా, మురుగు నీటిని తీసి మళ్లీ నీరు అందివ్వాలి. పైరు వేయడానికి మడిని తయారు చేసే ముందు మట్టిని బాగా కలియబెట్టి ఆరబెట్టాలి. భూమిని ఎత్తు చేసి ఒకటిరెండు బండ్ల ఎర్రమట్టిని వేయాలి. పంట మధ్య కాలంలో పొలాన్ని సన్న నెర్రెలు వచ్చే వరకు ఆరగట్టి అప్పుడప్పుడు మళ్లీ నీరివ్వాలి. ఈ చర్యలతో క్రమంగా సల్ఫైడ్ దుష్ప్రభావం తగ్గుతుంది. అమ్మోనియం, సల్ఫేట్ వంటి ఎరువులను ఇలాంటి పొలాల్లో వాడకూడదు.



ఓ రైతు పొలంలోకి దిగి పంటను పరిశీలిస్తున్న కేవీకే సైంటిస్ట్

### జింక్ లోపం ఉంటే..

జింకు ధాతులోపంతో పొలాలు పాలిపోతున్నట్టు గుర్తించిన అధికారులు, నివారణ చర్యలను వివరిస్తున్నారు. ప్రతి యాసంగి సీజన్‌లో రైతులు ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా 10 కిలోల జింక్ సల్ఫేట్‌ను 200-250 కిలోల మాగిన పశువుల పేడ లేదంటే వర్మీ కంపోస్టు కలిపి 20 నుంచి 30 రోజుల పాటు గోనె సంచిలో ఉంచి మగ్గిన తర్వాత చివరి దుక్కిలో వేయాలని చెబుతున్నారు. పైరుపై జింక్ లోపం కనిపిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్‌ను కలిపి 5 రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారీ చేసుకోవాలని, జింక్ సల్ఫేట్ ద్రావణంలో పురుగులు, తెగుళ్ల నివారణ మందులు కలుపవద్దని, చౌడు నేలల్లో పిచికారీ తప్పని సరిగా చేసుకోవాలని సూచిస్తున్నారు.

## మార్కండేయ తపోవనంలో ఎంపీ పూజలు



మార్కండేయ మహర్షికి పూజలు చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 12 : మార్కండేయ మహర్షి జయంతి సందర్భంగా అనంతపద్మనాభస్వామి దేవాలయం సమీపంలోని మార్కండేయ తపోవనంలో సోమవారం ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎంపీని శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారితో పాటు కౌన్సిలర్లు నవీన్‌కుమార్, అనంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పేదలకు వరంగా టెలీ మెడిసిన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ సర్కార్ ప్రవేశపెట్టిన టెలీమెడిసిన్ సేవలు పేద రోగులకు వరంలా మారాయి. కరోనాకు ముందు ప్రారంభించిన ఈ సేవలు కొవిడ్ కష్టకాలంలో రోగులకు ఎంతో ఉపయోగపడ్డాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఉన్న అన్ని బస్తీ దవాఖానల నుంచి ఆన్‌లైన్ విధానంలో ఈ టెలీమెడిసిన్ సేవలు అందిస్తున్నారు. నిమ్స్, ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఎంఎన్‌జే, పేట్లబుర్జ్, సుల్తాన్‌బజార్ ప్రసూతి దవాఖానల ద్వారా కూడా సేవలు అందుబాటులో ఉన్నాయి. టెలీమెడిసిన్ ద్వారా ఆర్థో, డెర్మటాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ, అంకాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూరాలజీ తదితర సేవలను అందిస్తున్నారు. కేసీఆర్ సర్కారు తీసుకొచ్చిన టెలీమెడిసిన్ ద్వారా నేడు వందలాది మంది రోగులు ఇంటి దగ్గరలోని బస్తీ దవాఖానల నుంచే నిమ్స్, ఉస్మానియా, గాంధీ వైద్యసేవలు పొందుతున్నారు. అంతే కాకుండా క్యాన్సర్, గుండె సమస్యలు వంటి దీర్ఘకాలిక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించగలుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

